జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 4-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 387 పేజీలు: 4 వెల: రూ.7



## శ్రీకాకుళం నగర పారిశుద్ధ్యానికి..
# చెత్త మార్కు!

*** చెత్తచెత్తగా సిక్కోలు * రాష్ట్ర సర్వేలో 13వ స్థానం * మున్సిపాలిటీల్లోనే ఇదే దుస్థితి * ఆమదాలవలస 54, పలాస 74, ఇచ్ఛాపురం 8వ స్థానం * పలాసకాశీబుగ్గలో మరి దారుణం * చెత్త దాచలేకపోయిన ఐవీఆర్‌ఎస్ కాల్స్**

**శ్రీకాకుళం, జూలై3 (వార్త):** అన్ని రంగాల్లో అట్టడుగున అని పిలుచుకునే శ్రీకాకుళం జిల్లా మిగిలిన జిల్లాలతో పోటీ పడాల్సిన పరిస్థితుల్లో... కనీసం పారిశుధ్య నిర్వహణలో నైనా కనీస ర్యాంకుల్లో లేదు. శ్రీకాకుళం నగర పారిశుధ్య నిర్వహణ ఇంకా చెత్త చుట్టూ తిరుగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తాజా సర్వేలో, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రవ్యాప్తంగా 17 కార్పొరేషన్లలో 13వ స్థానానికి పరిమితమైంది. పారిశుధ్యంలో నగరానికి 'చెత్త మార్కు' పడినట్టు సర్వే వివరాలు తేటతెల్లం చేశాయి. ఈ సర్వే ప్రత్యేకత ఏంటంటే... ప్రభుత్వమే నేరుగా ఐ వీ ఆర్ ఎస్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించింది. అందులో పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఇంటింటి నుంచి చెత్త సేకరణ, బహిరంగ ప్రదేశాల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీ నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రజలే స్వయంగా తీర్పు చెప్పారు.

### శ్రీకాకుళం కార్పొరేషన్‌పై ప్రజల తీర్పు:

చెత్త సేకరణ: 67.9శాతం ప్రజలు "అంతకంతకు మెరుగవుతుందని" చెప్పినప్పటికీ, పూర్తి సంతృప్తి మాత్రం లేదు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త తొలగింపు: కేవలం 54.9శాతం ప్రజలకే సంతృప్తి. అంటే, దాదాపు అర్ధ వంతు ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు.

డ్రైనేజీ సేవలు: 58.5శాతం ప్రజలు సరే అనగా, మిగతా వాళ్లంతా అసంతృప్తితో ఉన్నారు.

మొత్తం సంతృప్తి రేటు: అన్ని అంశాలను కలిపి చూస్తే, కేవలం 58.7శాతం మాత్రమే సంతృప్తిగా ఉన్నారు.

ఇందులో ముఖ్యంగా 40శాతం పైగా ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నది అధికారం గమనించాల్సిన అంశం.

### పక్క జిల్లాలెక్కడ... మనం ఎక్కడ!

ఈ సర్వేలో గుంటూరు కార్పొరేషన్ అగ్రస్థానంలో నిలవగా, మూడింతల దూరంలో ఉన్న విజయనగరం కార్పొరేషన్ రెండో స్థానం దక్కించుకుంది. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాగా ఉన్న విజయనగరం రెండో స్థానంలో నిలవగా, శ్రీకాకుళం మాత్రం 13వ స్థానంలో ఉండటం జిల్లా ప్రజలను తీవ్రంగా కలవరపెడుతోంది.

### అలసత్వానికి కారణం అదేనా?

ప్రస్తుతం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండల్కర్ స్వయంగా కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్నప్పటికీ, పారిశుధ్య రంగం మారని దుస్థితిలో ఉంది. దశాబ్ద కాలంగా కార్పొరేషన్‌కు ఎన్నికలు లేకుండానే నడవడం, చైర్మన్ లేకపోవడమే దీనికి ప్రధాన కారణంగా విశ్లేషణలు చెబుతున్నాయి. ప్రజాప్రతినిధుల లేని స్థితి విధ్వంసకరమైన పారిశుధ్య పరిస్థితికి దారి తీసిందని నిపుణులు చెబుతున్నారు.

### మున్సిపాలిటీల్లోనూ మరీ దారుణం

రాష్ట్రంలోని 77 మున్సిపాలిటీల సర్వేలోనూ శ్రీకాకుళం జిల్లా పరువు నిలబడలేదు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 8వ స్థానంలో నిలిచి కొంత వెసులుబాటు ఇచ్చినా, ఆమదాలవలస మున్సిపాలిటీ 54వ స్థానంతో వెనుకబడింది. పలాస మున్సిపాలిటీ మాత్రం ఇంకా దారుణంగా 74వ స్థానంలో నిలిచి జిల్లాలోని మున్సిపాలిటీలు ఎంత చెత్త పరిస్థితిలో ఉన్నాయో మరోసారి రుజువైంది. రాష్ట్రంలోని 77 మున్సిపాలిటీలలో పలాస స్థానం 74 అంటే పరిస్థితి ఎంత దిగజారింది అనే విషయాన్ని చెప్పక తప్పదు.

### జవాబుదారి ఎవరు?

ఈ మొత్తం రిపోర్ట్‌లో ఎక్కడా రాజకీయ జోక్యం లేదు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజలే స్వయంగా చెప్పిన మాటలే అధికారిక డేటా రూపంలో బయటపడింది. దీంతోపాటు అధికార యంత్రాంగం ఆత్మపరిశీలన చేసుకోక తప్పదు. శ్రీకాకుళం నగరంతో పాటు, జిల్లాలోని మున్సిపాలిటీల పారిశుధ్య పరిస్థితి ప్రస్తుతానికి అత్యంత దయనీయంగా ఉంది. ఇకనైనా అధికారులు మేలుకొని పారిశుధ్యంపై తీవ్ర దృష్టి పెట్టకపోతే, ప్రజలు మరింత బాధలు అనుభవించక తప్పదు. "పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఇంట్లోకి వచ్చి చెత్త తీసుకెళ్తున్నా... బయట మాత్రం చెత్త కుప్పలే అన్నది ప్రజల బాధ!" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## చెత్తకేంద్రాలే.. పేకాట నిలయాలు

**సరుబుజ్జిలి, జూలై 3 (వార్త):** సరుబుజ్జిలి మండలంలోని సలంత్రి, పురుషోత్తపురం గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలు పేకాటకు నిలయాలుగా మారాయి. లక్షలాది రూపాయలతో వెచ్చించిన కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో కొందరు వీటిలో పేకాట ఆడుకుంటున్నారు. సలంత్రి గ్రామంలో చెత్తకేంద్రంలో ఐదుగురు, పురుషోత్తపురంలో ఏడుగురు పేకాట ఆడుతుండగా గురువారం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకుని సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌కి అప్పజెప్పారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ హైమవతి తెలిపారు.



## కూటమి నేతలు..
# మోసగాళ్లు



*** ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన * కూటమి ప్రభుత్వంతో ప్రజలకు తీరని నష్టం * వైసీపీ శ్రేణులపై వేధింపులు, కేసులకే పరిమితం * మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు**

**శ్రీకాకుళం, జూలై 3 (వార్త):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు కూటమి నేతలు మోసగించారని మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మోసగాళ్లని విమర్శించారు. గురువారం శ్రీకాకుళం అరసవల్లి రోడ్‌లోని సన్ రైజ్ హోటల్‌లో వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామన్నారు. కార్యకర్తలు, నాయకులు వీటిని ఫొటోలు తీసుకుని సోషల్ మీడియాలో విశేషంగా ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ అమలుపై గొప్పలు చెప్పి ప్రభుత్వం ఏర్పడ్డాక వాటిని పక్కనే పెట్టేశారన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు నష్టం వాటిల్లిందని ఆరోపించారు. కృష్ణదాస్ మాట్లాడుతూ ఈ వంచన ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరపడిందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసహనం పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి జైలుకు పంపించడమే అజెండాగా పనిచేస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. టెక్కలి వైసీపీ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ మాట్లాడుతూ అచ్చెన్నాయుడు.. జిల్లా అభివృద్ధికి ఏం చేశారన్నారు. దాచుకోవడం, దోచుకోవడం తప్పా ఎటువంటి అభివృద్ధి చేయలేదంటూ ధ్వజమెత్తారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాంలు కూటమి ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేశారు. ఏడాది పాలనలో అంతా అవినీతిమయమేనన్నారు. కూటమి ఎమ్మెల్యేలు ఇసుక, మద్యం వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం లేదని దుయ్యబట్టారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, జిల్లా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ధర్మాన ప్రసాదరావు డుమ్మా..

శ్రీకాకుళం నగరంలో నిర్వహించిన వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు డుమ్మా కొట్టారు. దీనిపై పార్టీ కేడర్‌లో చర్చనీయాంశమైంది. అసలు ధర్మాన ప్రసాదరావు పార్టీలో ఉన్నారా లేదా అనేది అర్థం కావడం లేదని, ఏ సమావేశానికి ధర్మాన ప్రసాదరావు కుటుంబం హాజరుకావడం లేదు. ఆయన పార్టీకి దూరంగా ఉండడం పట్ల కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధర్మాన జనసేన పార్టీలో చేరుతారని, అందుకే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని చర్చించుకోవడం కనిపించింది. ధర్మాన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడంతో ద్వితీయ శ్రేణి నాయకులు.. పార్టీ సమావేశాలకు హాజరుకావాలా వద్దా అనేది తేల్చుకోలేకపోతున్నారు. దీంతో శ్రీకాకుళం నియోజకవర్గంలో వైసీపీ నిస్తేజంగా ఉందని ఆ పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# కేకేఆర్ ఔదార్యం.. రైతులకు వరం

**సరుబుజ్జిలి, జులై 3(వార్త):** చిన్న కాగితాపల్లి, మతలబుపేట, రసూల్‌పేట, బుడ్డివలస రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులు 17 ఏళ్లుగా అతివృష్టి, అనావృష్టితో ఇబ్బంది పడుతున్నారు. దీంతో చిన్నకాగితాపల్లి టీడీపీ నాయకుడు కూటికుప్పల కోటేశ్వరరావు వీరి ఇబ్బందులను ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ చర్యల నిమిత్తం అచ్చన్న చెరువు నుంచి బొబ్బిలి వాణి సబ్ కెనాల్‌కు నీరు నిలిపేందుకు సొంత ఖర్చుతో నీటి కుండలను ఏర్పాటు చేశారు.

ఉగాదికల్లా మర తలుపులతో కల్వర్ట్ నిర్మిస్తామని కోటేశ్వరరావు తెలిపారు. ఈ నీటి కుండల ఏర్పాటుతో అచ్చన్న చెరువు లోపల ఉన్న వ్యవసాయ భూమి ముంపునకు గురవ్వదని, దిగువన ఉన్న వ్యవసాయ భూమికి నీటి కొరత ఉండదని కోటేశ్వరరావు తెలిపారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.



# సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలి

-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, జులై 3(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలను ప్రజలు వచ్చి వినతిపత్రాలు అందజేశారు. పలు గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచి పోయిన అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వం వితంతు పింఛన్లు నిలిపి వేసిందని, వాటిని మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి వితంతు పింఛన్లు అందిస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, చౌదరి బాబ్జీ, నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గిరిజనుల సాగు భూములకు పట్టాలివ్వాలి



**మందస, జులై 3(వార్త):** బుడారిసింగి రెవెన్యూలో గిరిజన రైతులు సాగు చేసు కుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు సవర నీలకంఠం డిమాండ్ చేశారు. గిరిజన రైతులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెత్తుకోల, పద్మాపురం, బి.పద్మాపురం గిరిజన రైతులు సుమారు 60, 70 ఏళ్ల నుంచి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఐటీడీఏ పీవోకు, మందస తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నో ఏళ్లుగా వినతిపత్రం సమర్పించినా అధికారులు గిరిజనులకు సాగు పట్టాలు మంజూరు చేయకపోవడం చాలా అన్యాయమన్నారు. ప్రస్తుతం కొంతమంది గిరిజనేతరులు, బీసీ వ్యక్తులు ఆ భూములను కొనుగోలు చేశామని గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి చర్యలను తీవ్రంగా సంఘం తరఫున ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకుల చౌదరి లక్ష్మీనారాయణ, వాకడ నారాయణ, శ్రీను, రామచంద్ర, మాజీ ఎంపీటీసీ మాన్ సింగి కొల్లి, హేరబరావు, దేవ, రైతులు మాన్‌సింగి దాడు, పాయికో బొనమాళి, సవర సోంతుని, సవర లక్ష్మణ, గోపి, సవర దుర్యోధన, సవర తిరుపతి, సవర భీమారావు, రైతులు పాల్గొన్నారు.

# జీడి కార్మికులకు..యజమానులకు మధ్య కుదిరిన వేతన ఒప్పందం

**మందస, జులై 3(వార్త):** జీడి కార్మికులు, యాజమాన్యాలకు మధ్య వేతన ఒప్పందం కుదిరింది. గతంలో ఇస్తున్న వేతనాలకు రూ.2.50లు కేజీకి పెరుగు దలకు యజమానులు అంగీకరించారు. ఈ పెంపుదల 2026 మే 14వరకు అమలులో ఉంటుందని కార్మిక నాయకులు తెలిపారు. ఈ చర్చల్లో సీఐటీయూ నాయకులు ఎన్.గణపతి, కె.కేశవరావు, బి.దుర్యోధన, పి.కుర్మారావు, జీడి సంఘం నాయకులు సీహెచ్ చంద్రావతి, అల్లు హేమలత, సీహెచ్ జానకమ్మ, కె.శాంతమ్మ, కె.ధనము, కుమారి, యాజమాన్యం జె.ప్రసాదరావు, ఐ.కేశవరావు, మద్ది శివ, మద్ది రమణమూర్తి, మార్కండేశ్వరరావు జీడి కార్మికులు పాల్గొన్నారు.



పోరాటానికి సహకరించిన వారందరికీ కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్జీయూకేటీలో ముగిసిన అడ్మిషన్స్

**శ్రీకాకుళం, జులై 3(వార్త):** శ్రీకాకుళం ఆర్జీయూకేటీలో అడ్మిషన్ల ప్రక్రియ నూజివీడులో ప్రశాంతంగా ముగిసింది. 547 మందికి కాల్ లెటర్స్ అందించారు. కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరగడం పట్ల శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య బాలాజీ సంతృప్తి వ్యక్తం చేశారు. అడ్మిషన్ల ప్రక్రియను రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ రవి గేదెల, మోహన్‌కృష్ణచౌదరి, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. వలంటీర్లు తగిన సహకారం అందించారు.





## పేకాటరాయుళ్ల అరెస్టు

**సరుబుజ్జిలి, జులై 3(వార్త):** షళంత్రి గ్రామంలోని పేకాట స్థావరంపై గురువారం టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడి చేశారు. ఆ గ్రామానికి చెందిన రాజు, అప్పలనాయుడు, సింహాచలం, పున్నయ్య, ఎర్రయ్య, అప్పన్నను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.4570, సెల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు.

## నీటి తొట్టెల పరిశీలన



**సరుబుజ్జిలి, జులై 3(వార్త):** పల్లె పండుగలో భాగంగా పశువులకు తాగునీరు కొరతను అధిగమించడానికి పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన నీటి తొట్టెలను సరుబుజ్జిలి ఉపాధి హామీ ఈసీ రమాదేవి గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆమె బప్పడాం పంచాయతీని సందర్శించారు. గ్రామంలోని నీటి తొట్టెలో పశువులు మంచినీటిని సేవించడాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేసారు. తప్పని సరిగా తొట్టెల్లో నీరు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు పేడాల మణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐ.ఐ.హెచ్.టి.లో స్పాట్ అడ్మిషన్లు

**శ్రీకాకుళం, జులై 3(వార్త):** ఐఐహెచ్టీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని జిల్లా చేనేత వస్త్రాల అధికారి టి. జనార్దనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ, వెంకటగిరి, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థ అని తెలిపారు. హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ టెక్నాలజీలో 3 సంవత్సరాల డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ వారితో సర్టిఫికెట్స్ జారీ చేయబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంస్థలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. 10వ తరగతి పాసైన అభ్యర్థులకు వారి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారని, ఇంటర్మీడియట్ (ఎం.పి.సి) పాసైన వారు నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చని తెలిపారు. ఈ కోర్సు చదివేవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు స్టైఫండ్ నెలకు రూ:2500/- పొందుతారన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వెంటనే క్యాంపస్ సెలెక్షన్స్ ద్వారా అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. చేనేత, జౌళి శాఖకు సంబంధించిన ప్రభుత్వ ఉద్యోగాలకు వీరికి అవకాశం కలదన్నారు. ఆసక్తి గల వారు ఆగస్టు 1లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కాలేజీ వెబ్‌సైట్ www.ihtygr.comను సందర్శించాలని సూచించారు. సెల్ నంబర్లు 9866169908, 9010243054 సంప్రదించాలని కోరారు.

## తేరపల్లి-కొండవూరు సాగునీటి కాలువ పూడిక తీత పనుల పరిశీలన

**పలాస, జులై 3(వార్త):** సాగునీటి కాలువల్లో దశాబ్ద కాలంగా పూడిక తీయకపోవడంతో శివారు భూములకు నీరు అందక రైతులు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు. కొండ ఊరు తేరపల్లి వరకు గల పిల్ల కాలువల్లో పూడిక, పిచ్చిమొక్కల తొలగింపు పనులను గురువారం పలాస జనసేన పార్టీ సమన్వయకర్త దుర్గారావు పరిశీలించారు. ఈ ఏడాది సాగునీటి కష్టాలు తప్పనున్నాయని, శివారు ప్రాంత రైతాంగం ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి, వంశధార ఇంజనీరింగ్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రోటరీ అధ్యక్షుడుగా వెంకటేష్ రెడ్డి

**ఇచ్ఛాపురం, జులై 3(వార్త):** ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ తిప్పన మోహన్ వెంకటేష్ రెడ్డి, కాదా రామ కోటి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు పదవీ స్వీకరణ కార్యక్రమం రోటరీ హాల్‌లో జరిగింది. కార్యక్రమంలో ఒడిశా రోటరీ జిల్లా మాజీ గవర్నర్ రభి నారాయణనంద, కంచిలి హెడ్ కానిస్టేబుల్ తెలుకల రామారావు, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.






## సర్వేలంటూ ఉద్దానంలో అడుగు పెడితే సహించం

**మందస, జులై 3(వార్త):** రాంపురం పంచాయతీ టి.గంగువాడలో చిత్త గున్నయ్య ఆధ్వర్యంలో కార్గో ఎయిర్‌పోర్టు బాధిత రైతులంతా ఏకమై కమిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధిత రైతులు మాట్లాడుతూ ఎయిర్ పోర్ట్ వద్దని, భూములే కావాలని నినాదాలు చేశారు. సర్వేల పేరుతో ఉద్దానంలో అడుగు పెడితే సహించమని స్పష్టం చేశారు.కార్గో ఎయిర్ పోర్ట్ రాకుండా ఎమ్మెల్యే శిరీష చేయాలని కోరారు. కార్యక్రమంలో దాసరి మోహనరావు, జోగి మోహనరావు, పుక్కల్ల నారాయణ, పుక్కల్ల బాలకృష్ణ, జోగి రామారావు, చిత్త రవి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్, ఎస్పీకి కృతజ్ఞతలు



**శ్రీకాకుళం, జులై 3(వార్త):** పాత శ్రీకాకుళం సిరిమాను కమిటీ సభ్యులు గురువారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండల్కర్, జిల్లా ఎస్పీని కలిశారు. సిరిమాను ఉత్సవాలను ఎంతో విజయవంతంగా నిర్వహించేందుకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ను పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్, ముఖ్య సలహాదారు రామ లింగేశ్వర స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శంకరరావు, కార్యదర్శి మాపూరు శేఖర్, కల్లేపల్లి సోంబాబు, కర్రి రంగాజీదేవ్, అదపాక రాంబాబు పాల్గొన్నారు.

## ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ దినోత్సవం



**ఇచ్ఛాపురం, జులై 3(వార్త):** ఇచ్ఛాపురంలోని హాస్పిటల్ రోడ్డులో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. కిడ్నీ రోగులకు ఆర్థిక సాయం చేశారు. 50 మంది నిరుపేద లకు రేషన్ సరుకులు అందజేశారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్తి అన్వేష్, కొత్తపల్లి అబ్రహం, జాన్ పాల్, ఏలీయా, బిమ్మో బేహెరా, బెనర్జీ, సుందర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండపల్లి ఆంధ్ర బాపిస్టు చర్చిలో పాస్టర్ ప్రకాశరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

## శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి



**ఇచ్ఛాపురం, జులై 3(వార్త):** ప్రతి మహిళా శక్తి యాప్ ను మొబైల్‌లో డౌన్ లోడ్ చేసుకోవాలని టౌన్ ఎస్ఐ ఎం.ముకుందరావు అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకరరావు, నవ్యశ్రీ, సుధాకర్, బాపూజీ, రజనీ కుమారి, సునీత, శాంతి పాల్గొన్నారు.

**మెళియాపుట్టి, జులై 3(వార్త):** మెళియాపుట్టిలోని ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్‌లో గురువారం టెక్కలి శక్తి టీం సభ్యులు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ యాప్ ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో టెక్కలి ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి

**-మున్సిపల్ కమిషనర్ రామారావు**

**పలాస, జులై 3(వార్త):** ప్రతి కుటుంబంలోని ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. డీజీ లక్ష్మి ఆటోమ్ కిసాక్స్ అనే కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. దీని ద్వారా పట్టణంలోని ప్రతి పొదుపు సంఘానికి కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, ఈ పథకంలో సభ్యురాలికి సంఘంలో మూడేళ్ల అనుభవం ఉండాలని, వయసు 21 - 40 ఏళనళ మధ్యలో ఉండాలని, పెళ్లై అదే ప్రాంతంలో స్థిర నివా సం ఉండాలన్నారు. ఆ మహిళ డిగ్రీ పాసై, స్మార్ట్ మొబైల్ వాడకం తెలిసి ఉండా లని తెలిపారు. ఈ పథకంలో ఎంపికైన మహిళలకు డీజీ



లక్ష్మి పేరుతో లాగిన్ ఓపెన్ చేస్తామన్నారు. వారికి ప్రభుత్వం మంజూరు చేసిన డివైజ్‌లను ఉపయోగించి ఈ సర్వీసులో పాలుపంచుకొనుటకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా ఏపీఎం మోహన్, ఆర్పీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం అలవర్చుకోండి



**-రైతులకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచన**

**సీతంపేట, జులై 3(వార్త):** కుసుమి గ్రామ పంచాయతీ పరిధిలో గల రైతు సేవ కేంద్రంలో గిరిజన రైతులకు శత శాతం రాయితీ పై కందులు , రాగులు పంపిణీ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులందరూ తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు మారి, వ్యవసాయాన్ని ఆరోగ్యకరం చేసుకోవాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు బిడ్డక సంధ్యారాణి, నిమ్మక నాగేశ్వర రావు, పాలక శశికళ, ఇమరక ప్రసాద్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్రు నయనాల మధ్య నేతాజీ అంత్యక్రియలు

**-జనసంద్రంగా మారిన మధ్య గ్రామం**

**మందస, జులై 3(వార్త):** మధ్య గ్రామానికి చెందిన జనసేన నాయకుడు నేతాజీ రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహాన్ని గురువారం ప్రత్యేక వాహనంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానికులు భారీ ర్యాలీతో మధ్య గ్రామానికి తీసుకువచ్చారు. దారి పొడవునా నేతాజీ అమరహే అంటూ నినాదాలు చేశారు. గ్రామానికి నేతాజీ మృతదేహం చేరుకోగా, ఒక్కసారిగా అందరూ ఘొల్లుమన్నారు. కుటుంబీకుల దుఃఖాన్ని ఆపడం ఎవరితరమూ కాలేదు. ప్రతీ ఒక్కరూ కన్నీటి పర్యవంతమయ్యారు. జనసేన నియోజకవర్గం, మండల నాయకులు శ్మశానానికి చేరుకుని, అంత్యక్రియలు జరిగే వరకు ఉన్నారు. నేతాజీ మరణంతో మంచి నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబానికి సంతాపం తెలిపారు.



### ర్యాలీలు, నిరసనలు, బంద్‌కు...

# అనుమతి తప్పనిసరి

- వారం రోజులు ముందే దరఖాస్తు చేసుకోవాలి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం క్రైం, జులై 3 (వార్త):** శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బందులు నిర్వహణకు సంబంధిత పోలీసుల ముందస్తు అనుమతిని తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వారం రోజుల ముందుగా ఆ ప్రాంత పరిధిలో పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ వారికి వివరాలు, సమాచారం అందించి, పోలీస్ సబ్ డివిజనల్ అధికారి నిర్దేశించిన అనుమతులను తీసుకోవాల్సివుంటుందన్నారు. ఎందుకు నిర్వహిస్తున్నారు, ఎంతమంది వస్తున్నారు, ప్రారంభ సమయం, ముగింపు సమయం, రూట్, స్థలం ఇలా పలు వివరాలు అందించాల్సివుంటుందన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు దృష్టిలో పెట్టుకుని పోలీస్‌లకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## రామావతారంలో జగన్నాథుడు

**శ్రీకాకుళం, జులై3 (వార్త):** జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసిపురంలోని గుండిచా మందిరంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవిలు గురువారం భక్తులకు శ్రీరామ అవతారంలో దర్శనమిచ్చారు. స్వామివారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు సుభాష్ చంద్ర పండా నిర్వహించారు. గుండిచా మందిరం ఆవరణలో మధ్యాహ్నం, రాత్రి పూట భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు బాలు పాణిగ్రాహి ఏర్పాట్లు చేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నేడు రాంపురంలో ప్రత్యేక వైద్య శిబిరం

**మందస, జులై 3(వార్త):** రాంపురంలో ఈ నెల 4న రాంపురం గ్రామ పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. రాగోలు జెమ్స్ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వైద్య శిబిరాన్ని రాంపురం గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు జెమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ రాపాక తిరుపతిరావు 7093295821,7337222768 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

# ఉత్సాహంగా సుపరిపాలనలో తొలిఅడుగు

**ఆమదాలవలస, జులై 3(వార్త):** టి.జౌన్నవలసలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నూక రాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నారాయణ పురం ప్రాజెక్టు చైర్మన్ సనపల ఢిల్లీ, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, గ్రామ టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





### ఇచ్ఛాపురంలో..

**ఇచ్ఛాపురం, జులై 3(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 4వ వార్డులో సు పరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ గేదల శేఖర్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ పత్రి తవిటయ్య, సెక్రటరీ నందిగం కోటేశ్వరరావు, స్టేట్ సెక్రటరీ సాలిన ఢిల్లీ, కాళ్ళ ధర్మారావు, నందికి జానీ, కాళ్ల దిలీప్, యూత్ ప్రెసిడెంట్ ఆసి ధర్మరాజు రెడ్డి, సెక్రటరి కోయాల రామారావు, ఆసి లీలరాణి, రెయ్యి జానీ, కోర్రాయి ధర్మరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### డొంకూరులో..

**ఇచ్ఛాపురం, జులై 3(వార్త):** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని భూర్జపాడు పంచాయతీ పరిధిలో గల డొంకూరులో గురువారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు దున్న కూర్మారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, దక్కత ఢిల్లీరావు, డి.కామేశ్వరరావు, ఎం.సూర్యనారాయణ, పి.బాబ్జీరావు, వడ్డన ధర్మరాజు, నాగరాజు, టి.బాల, దున్న లోకేష్, శివంగి గణపతి, దున్న కూర్మారావు, సంగారు మోహనరావు, సూర్యనారాయణ, కృష్ణ, ఎన్.జనార్దన్, పెద్దలు, యువత మహిళలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



**మందస, జులై 3(వార్త):** బడుగు బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా కూటమి సర్కార్ పాలన సాగిస్తుందని రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన అన్నారు. గురువారం ఆయన సరియాపల్లి, జిల్లుండలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కూటమి సర్కార్ ఏడాది పాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఏడాది పాలనలో ప్రజలు సుఖ, సంతోషాలతో ఆనందంగా ఉన్నారనిన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తమిరి భాస్కరరావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, ముంజేటి చంద్రశేఖర్, కొనారి తులసిరావు, మంగళ పాత్రో, సాలిన భీమారావు, బదకల వెంకటరావు, సిర్ల కృష్ణారావు, అడ్డి ఉమాపతి, అడ్డి ఈశ్వరరావు, బాడపల్లి ఆనందరావు, ధర్మరాజు, బత్తిన కృష్ణారావు, నోరియ హరి, డుంకురు తిరుపతి, కొర్రాయి శ్రీను, కొర్రాయి బాలకృష్ణ, పీరికట్ల హేమసుందర్, లక్ష్మీనారాయణ, సీర ఈశ్వరరావు, కొల్లి పురుషోత్తం పాల్గొన్నారు.



### బొడ్డపాడులో..

**పలాస, జులై 3(వార్త):** బొడ్డపాడు గ్రామాన్ని అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని క్లస్టర్ ఇంచార్జి మురుపింటి కుమార్ రాజ్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు ప్రతీ ఇంటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం గురువారం బొడ్డపాడు గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బొడ్డపాడు గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు దుష్యంత్, బొడ్డపాడు టీడీపీ నాయకులు కిక్కర ఢిల్లీరావు (కేడిర్), బొడ్డు జగన్, గర్తం కృష్ణమూర్తి, బుడత విప్లవ్ కుమార్, నాయుడు మోహన్ రావు, గర్తం శారద, బొడ్డు శంకర్, తిమ్మల భీమారావు, ఉప్పరపల్లి కృష్ణారావు, ఉప్పరపల్లి దుష్యంత్, రాజాం లోకేష్, బొడ్డు అప్పిలమ్మ, గేదెల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

**మందస, జులై 3(వార్త):** జిల్లుండ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ డుంకురు తిరుపతి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ పీరకట్ల హేమసుందర్, కొల్లి లక్ష్మీనారాయణ, బూత్ కన్వీనర్ కుదాల శివాజీ, నీటి సంఘం టీసీ కొర్రాయి శ్రీను, టీడీపీ సీనియర్ నాయకులు కొంటేన లక్ష్మీనారాయణ, నర్తు హరికృష్ణ, కొర్రాయి జగ్గారావు, వడిశ నవీన్, బుడి సురేష్, కొర్రాయి షణ్ముఖరావు, కొంటేన తిరుపతి, కర్రి సోమేశ్, కొంటేన భాస్కరరావు, డుంకురు సతీష్, జిల్లుండ టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ పాల్గొన్నారు.





**కొత్తూరు, జులై 3(వార్త):** కొత్తూరు మండలం కడుము గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సూపర్ సిక్స్ అమలు తీరును ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ పరిశీలకులు బుద్ధ త్రినాథరావు, నాయకులు, క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి యువత నడుం బిగించాలి

**పలాస, జులై 3(వార్త):** సమస్యల పరిష్కారానికి యువత నడుం బిగించి ముందుకు రావాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణల ద్వారా మార్పును సాధించవచ్చన్నారు. కోఆర్డినేటర్లు పి.వెంకటరమణ, ఎం.శ్రీనివాస్ పట్నాయక్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజంపై యువత చూపే ప్రభావం, సామాజిక మార్పు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, రాజకీయ, సామాజిక ఉద్యమాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి రావు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంతటి వారైనా నేరస్తులను విడిచిపెట్టం : సీఐ



**పలాస, జులై 3(వార్త):** నేరస్థులను ఎంతటి వారైనా విడిచి పెట్టేది లేదని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ అన్నారు. గురువారం పలాస రైల్వే స్టేషన్లో విస్తృతంగా డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌లాంటి మాదకద్రవ్యాలు రవాణా చేస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి కేసుల్లో పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని, రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే స్టేషన్లో, ప్రయాణికుల లగేజ్‌ను డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బంది, కాశీబుగ్గ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




**ఇచ్ఛాపురం, జులై 3(వార్త):** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఈ మురళీమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామారావు అధ్యక్షతన శానిటేషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. పారిశుధ్య నిర్వహణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో అర్‌డబ్ల్యుఎస్ ఏఈ కూన విష్ణుమూర్తి, మెడికల్ ఆఫీసర్ వెచ్చా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం

**మందస, జులై 3(వార్త):** మందస మండలంలోని నరసింగపురం పంచాయతీ మహాదేవిపురం గ్రామానికి చెందిన మూలి సింహాచలం ఇటీవల మరణించారు. కూలీ పని నిమిత్తం వెళ్తుండగా కంచిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సుమారు 25 ఏళ్ల వయస్సున్న కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు మూలి సరస్వతి, పీతాంబరం తల్లడిల్లిపోయారు. కుటుంబ ఏకైక దిక్కు కోల్పోయిన వారికి గ్రామస్తులు ధైర్యం చెప్పారు. ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. గ్రామంలో యువకులు, పెద్దలంతా రూ.20 వేలు, వంద కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు సాయం అందజేశారు. గ్రామస్తులు చూపిన ఉదారతకు వారు ధన్యవాదాలు తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546